# భారతీయ విద్యా కేంద్రము

డోర్ నెం. 10 - 1 - 35, వేమన మార్గ్
సంపత్‌వినాయక గుడి ప్రక్కన, విశాఖపట్నం - 530 003.

email : bvkvsp@gmail.com

website : www.bvk.org.in


## ముందుమాట

సేవ, సమర్పణ ఇవే మనదేశ జాతీయాదర్శాలు అని చెప్పిన స్వామి వివేకానందుని మాటలను అనుసరించి భారతీయ విద్యా కేంద్రము విద్య ద్వారా సమాజ సేవ చేయాలనే సత్సంకల్పంతో గత మూడు దశాబ్దాల నుండి సముద్ర తీర, గిరిజన ప్రాంతాలలో అనేక సేవా కార్యక్రమాలు మరియు ఉచిత విద్యాలయాల ద్వారా మారుమూల గ్రామాలలోని బాలలకు విద్యాగంధాన్ని అందించడంతోపాటు ఆయా ప్రాంతాలలో సామాజిక పరివర్తన కొరకు చేస్తున్న ప్రయత్నం ఆశించిన స్థాయిలో ఫలితాలనివ్వడం హర్షించదగ్గ పరిణామం.

ఈ పవిత్ర యజ్ఞంలో భాగస్వాములైన కార్యకర్తలందరికీ అభినందనలు. సామాజిక పరివర్తనే ధ్యేయంగా నిర్వహింపబడుతున్న ఈ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని, గ్రామస్థులు తమ గ్రామ పరివర్తనలో భాగస్వాములు కావాలని, ఈ కార్యం మరిన్ని గ్రామాలకు విస్తరించాలని ఆకాంక్షిస్తూ.........

ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు
అధ్యక్షులు

## విద్య-సామాజిక చైతన్యం

భారతీయ విద్యా కేంద్రము విశాఖపట్నం కేంద్రంగా 67 సంవత్సరాలుగా విద్యా రంగంలో పని చేస్తున్న సంస్థ. ఈ సంస్థ విద్యాభారతి అఖిల భారతీయ శిక్షాసంస్థాన్, న్యూఢిల్లీకి అనుబంధంగా ఉన్నది. విద్యాభారతికి అనుబంధంగా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కలిపి 24 వేల విద్యాలయాలు నడుస్తున్నవి. విద్యాభారతి భారతీయ విలువలతో అందరికీ విద్య, అందుబాటులో విద్య, నాణ్యమైన విద్య లక్ష్యాలుగా సమాజ పోషితంతో నడుస్తున్న అతి పెద్ద స్వచ్ఛంద సంస్థ. నగరాలు, గ్రామాలలో విద్యాలయాలు, కళాశాలతోపాటుగా విద్య ద్వారా సేవ చేయాలనే సత్సంకల్పంతో భారతీయ విద్యా కేంద్రము గత 30 సంవత్సరాలుగా గిరిజన క్షేత్రంలో, సముద్ర తీర గ్రామాలలో ఏకోపాధ్యాయ పాఠశాలలను ఉచితంగా నిర్వహిస్తూ మారుమూల గ్రామాలలోని బాలలకు విలువలతో కూడిన విద్య నందిస్తోంది. విద్యార్థుల వికాసంతో పాటు, తీరప్రాంత మరియు గిరిజన గ్రామాలలో వారి సంస్కృతిని కాపాడుతూ వారి కుటుంబాలలో వారి గ్రామాలలో పరివర్తన కొరకు ప్రయత్నం చేస్తున్నది. అల్లూరి సీతారామరాజు జిల్లా, మన్యం పార్వతీపురం జిల్లాలలోని గిరిజన గ్రామాలలో మరియు శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ జిల్లాలలోని సముద్ర తీర గ్రామాలలో ఈ ఉచిత పాఠశాలలు నిర్వహించబడుచున్నవి. ఇవేగాక సాధారణ పాఠశాలల ఉపాధ్యాయుల ఆధారంగా వాటి పరిసర సేవా బస్తీలలో బాల సంస్కార కేంద్రములు కూడా నిర్వహించబడుచున్నవి. ఈ ఉచిత పాఠశాలల్లో ఆయా గ్రామాలలోని ఆసక్తి గల స్థానిక యువతీయువకులను శిక్షకులుగా నియమించి, వారికి ప్రతినెలలో ఒకరోజు పాఠశాలల నిర్వహణ నిమిత్తం ప్రశిక్షణ ఇవ్వబడుచున్నది. ఏకోపాధ్యాయ పాఠశాలలకు హాజరగుచున్న పిల్లలకు ప్రతి సంవత్సరం సమ్మేళనములు కూడా నిర్వహించబడుచున్నవి.

భారతీయ విద్యా కేంద్రము గిరిజన క్షేత్రంలో, సముద్రతీర గ్రామాలలో ఉచిత సేవా పాఠశాలలతో పాటు, పాడేరులో అనాథ మరియు పి.టి.జి (ప్రిమిటివ్ ట్రైబ్ గ్రూప్) గిరిజన బాలుర కొరకు ఉచిత ఆవాసమును, గిరిజన యువత కొరకు కౌశల్యాభివృద్ధి కేంద్రమును, మహిళల కొరకు కుట్టు శిక్షణా కేంద్రమును కూడా నిర్వహిస్తున్నది. గిరిజన, తీర ప్రాంతాల యువకుల వికాసం కొరకు వయోజన విద్యా కేంద్రాలు, వాలీబాల్, కబడ్డీ వంటి ఆటలలో స్పర్థలు కూడా నిర్వహిస్తున్నది.

ఈ ఉచిత విద్యాలయాలలో విద్యనభ్యసించిన చిన్నారుల ప్రవర్తనలో వ్యక్తిగతంగా చోటు చేసుకున్న మార్పులను, వారి కుటుంబాలలో, వారి గ్రామాలలో వచ్చిన పరివర్తనకు సంబంధించిన కొన్ని సజీవ

గుర్తించబడినది. ఈ సుదీర్ఘ కాల ఖండంలో సుమారు 15 వేల మంది చిన్నారులు ఈ ఉచిత విద్యాలయాల ద్వారా లబ్ధిపొంది జీవితంలో తమ కాళ్ళపై తాము నిలబడటమేగాక, అనుశాసనబద్ధమైన, సంస్కారయుతమైన జీవనాన్ని కొనసాగిస్తూ నిత్య జీవితంలో వారి సత్ప్రవర్తన ద్వారా సమాజంపై మంచి ప్రభావాన్ని చూపగలుగుతున్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలల ద్వారా పరివర్తన – గిరిజన క్షేత్రము

• సూకూరుపుట్టు (పాడేరు మండలం): ఈ గ్రామంలో మన ఏకోపాధ్యాయ పాఠశాల నడుస్తున్నది. ప్రభుత్వాధికారులు ఆ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో పక్కా భవనం నిర్మించి, ప్రభుత్వం ద్వారా ఉపాధ్యాయుని నియమించి ప్రభుత్వ పాఠశాల నిర్వహిస్తామని గ్రామస్థులకు చెప్పగా వారు ససేమిరా అనడం విశేషం. బి.వి.కె వారి ఏకోపాధ్యాయ పాఠశాల మాత్రమే మా ఊరిలో వుండాలని గ్రామస్థులనడం మనం యిస్తున్న శిక్షణ పట్ల వారికున్న విశ్వాసానికి నిదర్శనం.

• చెరువుకొమ్మువలస (పాడేరు మండలం): ఈ గ్రామంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు (ఆచార్యుడు) పాఠశాలలో చదువు చెప్పడంతో పాటు గ్రామంలోని రైతులందరినీ కంపోస్టు ఎరువుల వాడకం పట్ల జాగృతం చేసి కృత్రిమ ఎరువులకు స్వస్తి పలికించాడు. తద్వారా ఉత్పత్తి పెరగటంతో పాటు రైతుకు గిట్టుబాటు ధర అధికంగా లభించేటట్లు వారు పండించిన ధాన్యాన్ని తిరుపతిలోని వ్యవసాయ క్షేత్రానికి అమ్మించారు.

• పిల్లిపుట్టు (పాడేరు మండలం): ఈ పాఠశాలలో ఎక్కువ శాతం మంది పిల్లలు ఉదయం లేవగానే తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్నట్లుగా గమనించబడినది. వారు చదువుతున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయునికి కూడా ప్రతిరోజు పాదాభివందనం చేస్తున్నారు.

• నేరేడువలస(పాడేరు మండలం): ఈ కేంద్రంలో ప్రతివారం పిల్లలు స్వచ్ఛభారత్‌లో భాగంగా పాఠశాల సమీపంలోని చెత్తను ఏరి ఊరి చివర వేయడం చూసిన గ్రామస్థులు కూడా మొత్తం గ్రామ వీధులను శుభ్రం చేయడం ప్రారంభించారు.

• వైసోలములు (పాడేరు మండలం): ఈ పాఠశాల పిల్లలు ఊరి గుడిలో భజన చేయటం చూసిన గ్రామస్థులు భజన కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు ఈ పిల్లల్ని గ్రామ భజనకు తప్పక ఆహ్వానిస్తుంటారు. విద్యార్థుల తల్లిదండ్రులందరూ భజనకు హాజరగుతుంటారు.

• వంచెడిగొంది (పాడేరు మండలం): సేవా పాఠశాల ప్రభావం కారణంగా పిల్లలు ప్రభుత్వ పాఠశాలకు గైర్హాజరు కాకుండా ప్రతిరోజూ ఉత్సాహంగా వెళ్ళడం చెప్పుకోదగ్గ మార్పు. అలాగే పాఠశాల ప్రభావం కారణంగా "గుడ్‌మార్నింగ్, గుడ్ ఈవినింగ్" వంటివి చెప్పడం మానేసి, నమస్తే గురూజీ! అని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను, ఏకోపాధ్యాయ పాఠశాల ఆచార్యుణ్ణి కూడా సంభోదిస్తున్నారు.

• చీడిమెట్ట(పాడేరు మండలం): ఈ గ్రామంలో సేవా పాఠశాలలో నేర్పిన ఆసనాలను పిల్లలు ప్రతిరోజు ఇంటివద్ద అభ్యాసం చేస్తుంటారు. సేవా పాఠశాల విద్యార్థులు వారానికొకసారి గుడిలో భజనలు చేయడం గమనించిన గ్రామస్థులు వారానికి మూడు సార్లు వారి గుడిలో భజన కార్యక్రమాలను స్వయంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటినుండి మహిళలు వచ్చి గుడిలో పూజలు చేయడం చెప్పుకోదగ్గ పరిణామం.

• కొత్తాబు(పాడేరు మండలం): ఈ పాఠశాల ప్రభావం వలన అక్కడి ప్రజలు వ్యసనాలకు దూరం కావడం గమనించదగిన పరిణామం. ప్రభుత్వ ఉపాధ్యాయులు వివిధ విషయాలలో సేవా పాఠశాల పిల్లల ప్రతిభను గమనించి కొనియాడుతున్నారు.

• గిరిజన మహిళల సాక్షరత(పాడేరు మండలం): పాడేరులో గృహిణులైన గిరిజన మహిళల కొరకు ప్రత్యేక వయోజన మహిళా విద్యా కేంద్రాన్ని 5 సంవత్సరముల పాటు నిర్వహించుట జరిగినది. ఈ కేంద్రంలో మన సంప్రదాయాలు, సంస్కృతికి సంబంధించిన విషయాలేగాక, భాష, ప్రాథమికమైన గణిత పరిజ్ఞానంలో కూడా రెండు స్థాయిలలో (3,5 తరగతులు) శిక్షణ ఇవ్వబడినది. వీరందరూ NIOS ద్వారా 3,5 తరగతుల పరీక్షలను వ్రాసారు. వారికి NIOS ప్రమాణ పత్రములను కూడా అందజేయుట జరిగినది. గ్రామాంతరం వెళ్ళే సమయాలలో బస్సులపై ఉన్న ఊళ్ళ పేర్లను స్వయంగా చదువుటలో, దుకాణాలకు వెళ్ళి వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు ఆర్థికపరమైన లావాదేవీలను స్వయంగా చేయగలగటంలో, పిల్లల చదువు గురించి పట్టించుకోవటంలో ఈ శిక్షణ తమకు ఎంతగానో ఉపయోగపడుతోందని, నిత్యదైవ ప్రార్థన చేసుకునేందుకు మేము నేర్చుకున్న శ్లోకాలు, అష్టకాలు కూడా ప్రతిరోజూ చదువుకోవటానికి కూడా ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడిందని ఈ మహిళలు చెప్పారు.

• కౌశల్యాభివృద్ధి కేంద్రము (పాడేరు మండలం): అల్లూరిజిల్లా , పాడేరు మండలంలోని వంతాడపల్లిలో గిరిజన యువకుల కొరకు 2023 అక్టోబర్‌లో ఎలక్ట్రీషియన్ కోర్సుతో ఒక ఉచిత కౌశల్యాభివృద్ధి కేంద్రము ప్రారంభించబడినది. మొదటి బ్యాచ్‌లో 28 మంది యువకులు శిక్షణ పొందారు. వీరందరికీ ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి మరియు భోజన సౌకర్యం ఏర్పాటు చేయబడినవి. వారిలో ఆసక్తిగల యువకులకు

బ్యాంకు ద్వారా ఋణము ఇప్పించి ఎలక్ట్రికల్ రిపేర్ షాపులు ప్రారంభించుకొనుటకు అవకాశము కల్పించబడినది. భవిష్యత్తులో మరిన్ని కోర్సులు ప్రారంభించుటకు ప్రయత్నం జరుగుచున్నది. వీరికి శిక్షణ సమయంలో వ్యవసాయానికి సబంధించిన పనులు కూడా అలవాటు చేయబడినవి. ఈవిధంగా గిరిజన యువకుల స్వయం ఉపాధి కొరకు ప్రయత్నం జరుగుతున్నది.





• **గిరిజన మహిళల స్వయం ఉపాధి:** గత **10** సంవత్సరాలుగా పాడేరు కేంద్రంగా గిరిజన మహిళల స్వయంఉపాధి కొరకు కుట్టు శిక్షణా కేంద్రము నిర్వహించబడుచున్నది. ఇప్పటికి **18** బ్యాచ్‌లలో **650** మంది మహిళలు శిక్షణ పొందారు. వీరిలో చాలా మంది బ్యాంకు లోన్ ద్వారా స్వయంగా కుట్టుమిషన్‌లు కొనుక్కొని టైలరింగ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. మరి కొంత మంది టైలరింగ్ షాపులలో పనిచేస్తూ జీవనోపాధిని గడిస్తున్నారు. భారతీయ విద్యా కేంద్రం ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిక్షణ తమకు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతోందని మహిళలు ఆనందంగా చెబుతున్నారు.



• **అల్లూరిసీతారామరాజు గిరిజన బాలుర ఆవాస గృహ వార్షికోత్సవం:** **2009**వ సం॥లో వంతాడపల్లిలో హాస్టల్ (ఆవాసం) ప్రారంభించినప్పటి నుండి ప్రతి సంవత్సరం వార్షికోత్సవాన్ని తమ గ్రామంలో నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఒకరు ప్రతిపాదించడమేగాక, ఆ సందర్భంగా గ్రామాన్ని అలంకరించడం,

హాస్టల్ విద్యార్థులకు, కార్యక్రమంలో పాల్గొనే వారి తల్లిదండ్రులకు, ఇతరులకు వారే భోజన వ్యవస్థలు మరియు ఉత్సవ ఏర్పాట్లు బాధ్యతగా చేయడం అలవాటుగా మారింది.





• **విలువిద్యలో గిరిజన హాస్టల్ విద్యార్థుల ప్రతిభ :** పాడేరు హాస్టల్‌లో ఉండి చదివే విద్యార్థులకు భారతీయ విద్యా కేంద్రముచే విలువిద్యలో ప్రత్యేక శిక్షణ ఇవ్వబడిన కారణంగా బాల, కిషోర విద్యార్థులు వరుసగా 8సం॥ల పాటు విద్యాభారతి అఖిలభారత విలువిద్య పోటీలలో మరియు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే అఖిలభారత స్థాయి పోటీలలో కూడా పాల్గొని స్వర్ణ పతకాలను సాధించారు. ఈ విద్యార్థులు హాస్టల్ ప్రాంగణంలో వ్యవసాయానికి సంబంధించిన పనులలో కూడా శిక్షణ పొందుతుంటారు. వీరి ప్రభావం  వారి గ్రామాలపై చెప్పుకోదగ్గ స్థితిలో ఉంది.





• **ఇరడాపల్లి కొత్తవూరులో రామాలయ నిర్మాణం:** పాడేరు మండలంలోని ఇరడాపల్లి కొత్తవూరులో ఏకోపాధ్యాయ పాఠశాల చాలా ప్రభావవంతంగా జరుగుతున్నది. ఈ గ్రామంలో బి.వి.కె. ద్వారా ఉచిత వైద్య శిబిరములు కూడా నిర్వహించబడుతూ ఉండేవి. అదే విధంగా 2 సంవత్సరములు వరుసగా ఈ గ్రామంలో గిరిజన యువకుల వాలీబాల్, కబడ్డీ పోటీల నిర్వహణకు గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆతిథ్యమిచ్చారు. ఈ విషయం సేవావిభాగం కార్యకర్తల ద్వారా తెలుసుకున్న అప్పటి విద్యాభారతి అఖిలభారత సంఘటనా కార్యదర్శి ఈ గ్రామాన్ని స్వయంగా సందర్శించి, గ్రామస్థులతో ముచ్చటించి, గ్రామంలో రామాలయ నిర్మాణానికి

కావలసిన విగ్రహాలను ఉచితంగా సమకూర్చారు. ఆలయ నిర్మాణానికి కొంత మొత్తాన్ని భారతీయ విద్యా కేంద్రం విరాళంగా ఇవ్వగా, మిగిలిన ధనాన్ని గ్రామస్థులు స్థానికంగా సేకరించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి, గుడి కేంద్రంగా ధార్మిక కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నారు.





• పప్పుడువలస (అరకు మండలం): ఇక్కడి పిల్లలు ఏకోపాధ్యాయ పాఠశాల ప్రభావం చేత ప్రభుత్వ పాఠశాలకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా హాజరగుచున్నారు. ఉపాధ్యాయులకు, పెద్దలకు రెండు చేతులతో నమస్కారం పెట్టడం వీరికి సాధారణ అలవాటుగా మారినది.

• హట్టగుడ (అరకు మండలం): విద్యార్థులలో ఎక్కువ శాతం ఉదయం నిద్ర లేవగానే అరచేతులు చూసుకుంటూ “కరాగ్రేవసతే లక్ష్మీః” శ్లోకాన్ని పఠిస్తున్నట్లు గృహ సంపర్కంలో గుర్తించబడినది. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విషయంలోనూ ప్రథములుగా నిలుస్తున్నారు. సేవా కేంద్రం పిల్లలు పక్క గ్రామాలలోని బంధువుల ఇళ్ళకు వెళ్ళినపుడు వీరి ప్రతిభను చూసిన గ్రామస్థులు, వారిని ఏ కాన్వెంట్‌లో చదువుతున్నారని వాకబు చేయడం జరుగుతోంది.

ఏకోపాధ్యాయ పాఠశాల నిర్వాహకురాలిగా చేరిన తరువాత సూర్యోదయానికి ముందేలేవడం, ఇంటికి సంబంధించిన మరియు వ్యక్తిగత పనులను వాయిదా వేయకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయడానికి అలవాటుపడ్డానని ఈ కేంద్ర నిర్వాహకురాలు జె.కొండమ్మ చెప్పినది.

• గడయగుడ (అరకు మండలం): “నేను ఏకోపాధ్యాయ పాఠశాలలో చెప్తున్న విషయాలను గమనించిన మా గ్రామ పెద్దలు భారత ప్రధానమంత్రి గౌరవ శ్రీ నరేంద్రమోడి, దృశ్యశ్రవణ మాధ్యమంగా భారతదేశంలోని గిరిజన రాష్ట్రాలలో ఎంపిక చేసిన మహిళల కొరకు నిర్వహించిన ‘జన్‌మన్’ కార్యక్రమానికి నన్ను ఎంపిక చేయగా, ప్రధానమంత్రి కార్యాలయ కార్యదర్శి ఆన్‌లైన్ ఇంటర్వ్యూ నిర్వహించి రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ప్రతినిధిగా నన్ను ఎంపిక చేయడం నాకు సంతోషాన్నిచ్చింది. ఆ సందర్భంగా ఆ కార్యదర్శి నా మాటలు

గమనించి 'నీవు సంస్కృతం నేర్చుకుంటున్నావా? అని అడిగారు. నేను భారతీయ విద్యా కేంద్రం వారి సేవా పాఠశాలలో పనిచేస్తున్నానని చెప్పాను. అనంతరం ప్రధానమంత్రి ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సంభాషణలో వారు నన్ను తెలుగులోనే మాట్లాడమని కోరి, "దేశభాషలందు తెలుగులెస్స" అనే సూక్తిని ఆసందర్భంగా ఉటంకించారు. కార్యక్రమంలో పాల్గొన్న మిగిలిన 7 రాష్ట్రాల ప్రతినిధులకు ఒక్కొక్కరికి కేవలం 8ని॥ల సమయం మాత్రమే కేటాయించిన గౌరవ ప్రధానమంత్రి నాతో 23ని॥లు మాట్లాడటం నాకెంతో ఆనందాన్నిచ్చింది. కార్యక్రమ అనంతరం నాతో మాట్లాడిన తీరుపై ప్రధానమంత్రి ట్వీట్ చేసారు కూడా. మాగ్రామంలో మా కుటుంబాన్ని చూసి 5 కుటుంబాల వారు గుడికి రావడంతో పాటు పూజలు చేయడం కూడా ప్రారంభించారు. ఇది నాకు చాలా సంతోషంగా ఉంది." అని ఈ పాఠశాల నిర్వాహకురాలు శ్రీమతి గంగమ్మ చెప్పారు.



• **కంఠభౌంసుగుడ (అరకు మండలం):** ఈ సేవా కేంద్రం పిల్లలు ఇంటి వద్ద ప్రతినిత్యం సూర్య నమస్కారాలు చేస్తుంటారు. దస్తూరిలో గణనీయమైన మార్పు వచ్చినది. గ్రామ పండుగలలో పెద్దలకు వివిధ రకాలుగా సహాయపడుతుంటారు.

• **దళపతిగుడ (అరకు మండలం):** పాఠశాల ప్రారంభ దినాలలో విద్యార్థులు తెలుగు పదాలు చదవడానికి చాలా ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఆ ఇబ్బందిని అధిగమించి దోషాలు లేకుండా అద్భుతంగా చదవగలుగుతున్నారు, వ్రాయగలుగుతున్నారు.

• **చినరాజు పాకలు (చింతపల్లి మండలం):** ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మన సేవా పాఠశాలకు వచ్చి పిల్లలు నేర్చుకున్న విషయాలను స్వయంగా పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను మెచ్చుకుంటున్నారు.

• **కందులగాది(చింతపల్లి మండలం):** ఈ పాఠశాలను చింతపల్లి మండల విద్యాశాఖాధికారి సందర్శించారు. పిల్లలకు నేర్పబడుతున్న విషయాలను అడిగి తెలుసుకుని, పిల్లలను వివిధ విషయాలలో స్వయంగా ప్రశ్నించి, వారి సమాధాన సరళిని, ప్రతిభను చూసి ఆనందించడమేగాక భారతీయ విద్యా కేంద్రం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని అభినందించారు.

• లింగవరం (గూడెం- కొత్తవీధి మండలం): ఈ మండలంలో నక్సల్స్ ప్రభావం ఎక్కువ. ఒక సందర్భంలో ఒక నక్సలైట్ సేవా పాఠశాల జరుగుతున్న సమయంలో వచ్చి పాఠశాల "ఎవరు నడపమన్నారు? ఎందుకు నడుపుతున్నావని" అక్కడ నిర్వాహకురాలిని ప్రశ్నించగా ఆమె ధైర్యంగా వివరాలు చెప్పి, "మన గిరిజన పిల్లలకోసమే కదా!" వారు నడుపుతున్నారని చెప్పగా -మాటలు బాగా నేర్చావే చెల్లీ! జాగ్రత్త ! అని చెప్పి వెళ్ళిపోయాడు.  అప్పటి నుండి మన పర్యవేక్షకులు ఎప్పుడు పరిశీలనకు వెళ్ళినా అనంతరం వాళ్ళు వచ్చి వాకబు చేసేవారు. అయితే గ్రామస్థులు మాత్రం మన పాఠశాలకు మద్దతుగా నిలిచారు. ఈ పాఠశాలలో పిల్లలు అన్ని విషయాలలో మంచి ప్రతిభను కనబరుస్తున్నారు.

• కరకపుట్టు: పాఠశాల ప్రభావం వలన  పిల్లలందరూ బొట్టు పెట్టుకోవడం ప్రారంభించారు. గ్రామంలో పెద్దలు కనిపించినప్పుడు రెండు చేతులతో నమస్కరించడంతో పాటు, వారు నేర్చుకున్న ప్రాతఃస్మరణ ప్రతి ఉదయం ఇంట్లోని వారిచే కూడా చెప్పిస్తున్నారు. పిల్లలు పాఠశాలలో నేర్పిన అన్ని విషయాలను ఇంట్లో ఆచరించటం చూసి తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు వారే స్వయంగా దగ్గరుండి పాఠశాలకు తీసుకువస్తున్నారు.



• అడపవలస (డుంబ్రిగూడ మండలం): సేవా పాఠశాల ప్రభావం వలన ఇక్కడి పిల్లల చదువులో చురుకుదనం పెరిగింది. ఇక్కడి విద్యార్థులు గవర్నమెంట్ హాస్టల్‌లో మిగిలిన విద్యార్థుల కంటె అన్ని విషయాలలో ఎక్కువ మార్కులు సాధిస్తున్నారు.

• చిన్న అంజోడ (డుంబ్రిగూడ మండలం): ప్రతివారం ఈ గ్రామంలోని రామాలయాన్ని సేవా పాఠశాల విద్యార్థులే శుభ్రం చేస్తారు. పిల్లల వ్యక్తిగత వేషధారణలో మార్పు వచ్చినది. భజన పాటలు బాగా పాడతారు. భజనలు బాగా చేస్తారు.

• దబ్బ గరువు(హుకుంపేట మండలం): ఇక్కడ పాఠశాల ప్రారంభించిన రోజులలో బొట్టు పెట్టుకోని వారు కూడా పాఠశాల ప్రభావం వలన ఇప్పుడు అలవాటు చేసుకున్నారు. సేవా పాఠశాల పిల్లలు గుడిలో భజన

చేయడం గమనించిన గ్రామస్థులందరూ గుడికి రావడం, దైవ దర్శనం చేసుకోవడం ప్రారంభించారు. మహిళలు గుడిలో ప్రతిరోజూ దీపం వెలిగిస్తున్నారు.

• **తాడిపుట్టు (హుకుంపేట మండలం):** ఇక్కడి పిల్లలు వారానికొకసారి గుడిని శుభ్రం చేస్తుంటారు. ఇప్పుడు పిల్లలందరూ నన్ను 'మాతాజీ' అని సంబోధిస్తున్నారని నిర్వహకురాలు చెప్పారు. మహిళలు ప్రతిరోజు ఇంట్లో దేవుడి వద్ద దీపం వెలిగిస్తుండటం శుభపరిణామం.

• **బారాపల్లి (హుకుంపేట మండలం):** ఈ పాఠశాలలో విద్యార్థులు వారంలో ఒకరోజు గ్రామదేవత విగ్రహ సమీపంలో కూర్చొని భజన చేయడం చూసిన గ్రామస్థులు గ్రామంలోని శంకుదేవుడిని బాగా అలంకరించడం, దర్శనం చేయడం ప్రారంభించారు. పండుగలన్నీ అందరూ కలిసి సాంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్నారు.

• **గడికించుమండ (హుకుంపేట మండలం):** ఇక్కడి సేవా పాఠశాల పిల్లలకు ప్రతిరోజు స్నానం చేసిన అనంతరం దేవునికి తప్పక నమస్కరించే అలవాటు ఏర్పడింది. ప్రతివారం గుడిలో భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు.

• **కులపాడు (జి.మాడుగుల మండలం):** ఈ పాఠశాల ప్రభావం వలన ఈ గ్రామంలో సత్సంగం జరుగుతోంది. పిల్లల ప్రవర్తనలో మార్పును గమనించిన గ్రామస్థులు గిరిజన సంప్రదాయాలన్నింటినీ గౌరవిస్తూ పాటిస్తున్నారు.

• **పరదేశిపుట్టు (జి.మాడుగుల మండలం):** ఈ గ్రామంలో తల్లులు తమ పిల్లల్ని శుభ్రంగా తయారు చేసి, బొట్టు పెట్టి ఏకోపాధ్యాయ పాఠశాలకు పంపడం గమనార్హం. సేవా పాఠశాల జరుగుతున్న సమయంలో కొంత మంది తల్లిదండ్రులు వచ్చి కూర్చుని పిల్లలకు చెప్పే విషయాలన్నీ శ్రద్ధగా వింటున్నారు. పిల్లలందరూ నిర్వాహకుణ్ణి "ఆచార్యజీ" అని పిలుస్తున్నారు.

• **కర్నికలంక (జి.మాడుగుల మండలం):** ఏకోపాధ్యాయ పాఠశాల ప్రారంభించిన తరువాత ఊరి పిల్లల్లో చదువు పట్ల శ్రద్ధ పెరిగింది. పిల్లల ప్రభావం వలన వారి తండ్రులు దుర్వ్యసనములు తగ్గించుకుని పిల్లలను ప్రతిరోజూ బడికి పంపిస్తున్నారు. ఇక్కడి పిల్లలు ప్రతివారం గ్రామదేవత వద్ద భజన చేయడం చూసిన గ్రామస్థులందరూ ఆభజనలో పాల్గొనటం ప్రారంభించారు. గ్రామంలో గుడి నిర్మాణం చేపట్టి, పూజలు చేయడం కూడా ప్రారంభించారు.



అండంగిసింగి



కులపాడు

• **కరినికివలస (జి.మాడుగుల మండలం):** సేవా పాఠశాల పిల్లల సత్ప్రవర్తన కారణంగా కొందరు గ్రామస్తులు మద్యపాన వ్యసనానికి దూరమయ్యారు. పిల్లలు గుడిలో ప్రతివారం భజనలు చేయడం చూసిన గ్రామస్థులు స్వయంగా భజన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.




• **రోలుగుంట (చింతపల్లి మండలం):** సేవా పాఠశాల పిల్లలను ఇంటి నుండి బయటకు వెళ్ళేటప్పుడు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకొని వెళ్ళాలని ఏకోపాధ్యాయ పాఠశాల నిర్వాహకుడు చెప్పిన మీదట ప్రతిరోజు పిల్లలందరూ ఆవిధంగా చేయడం గమనించదగిన విషయం.

• **బద్దిమెట్ట (చింతపల్లి):** ఈ గ్రామంలోని పిల్లల చదువులో, ప్రవర్తనలో వచ్చిన మార్పును గమనించిన చుట్టుప్రక్కల గ్రామాలవారు తమ గ్రామాలలో కూడా సేవా పాఠశాలలను ప్రారంభించమని అడుగుతున్నారు.

• **కురుపాం మండలం:** మన్యం పార్వతీపురంజిల్లా గిరిజన క్షేత్రంలోని కురుపాం, జియ్యమ్మవలస మండలాలలో 10 ఏకోపాధ్యాయ పాఠశాలలు నిర్వహింపబడుతున్నాయి. ఈ మండలంలో సంగెడ్డ, కుంభికోట గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉన్నప్పటికీ పిల్లలెవరికీ పాఠశాలకు వెళ్ళే అలవాటు ఉండేది కాదు. ఉదయం లేచిన దగ్గర నుండి సాయంత్రం వరకు టి.వి.లు చూడటమే వారి పని. ఈ సేవా పాఠశాల నిర్వాహకుని ప్రత్యేక

ప్రయత్నం ద్వారా వారితో స్నేహం చేయడం వలన ఏకోపాధ్యాయ పాఠశాల ప్రారంభించబడి పిల్లలందరిని ఈరోజు బడిబాట పట్టించగలిగారు. ప్రస్తుతం పిల్లలందరూ ఆనందంగా సేవా పాఠశాలకు వస్తున్నారు. ప్రభుత్వ బడికి కూడా వెళ్తున్నారు.







• **బియ్యంవలస(కురుపాం మండలం):** ఈ గ్రామంలో మోస పూరితంగా విదేశీ మతాన్ని స్వీకరింపబడినవారిని, ఈ విదేశీమతం ద్వారా గిరిజన సంస్కృతికి జరుగుతున్న ప్రమాదాన్ని గుర్తెరిగి ఏకోపాధ్యాయ పాఠశాల ద్వారా సుమారు 30కు పైగా కుటుంబాలను తిరిగి స్వధర్మంలోనికి తీసుకురావడం జరిగింది. దీని కొరకు స్థానికంగా జరిగే ఉత్సవాలలో వారందరినీ పాల్గొనేటట్లు చేసి వారిని ఒప్పించి తిరిగి స్వధర్మంలోనికి వచ్చేటట్లు చేయడంలో మన ఆచార్యుడు కృతకృత్యుడయ్యాడు.

• **రావికోన (కొమరాడ మండలం):** రావికోనలోని ఏకోపాధ్యాయ పాఠశాలలో పిల్లలు సవర భాష మాట్లాడుతారు. వీరికి తెలుగు రాదు. అందువలన ఈ రెండు భాషలు వచ్చిన వ్యక్తిని ఆచార్యునిగా నియుక్తి చేసి ఆ ఏకోపాధ్యాయ పాఠశాలలోని పిల్లలకు తెలుగు భాష బోధన చేయడం వలన పిల్లలు ప్రస్తుతం తెలుగు చక్కగా నేర్చుకుంటున్నారు. మాట్లాడుతున్నారు, వ్రాస్తున్నారు.

• **బొర్రిగుడ (అరకు మండలం):** ఈ గ్రామంలో సేవా పాఠశాల ద్వారా విద్యార్థులకు గుండ్రని దస్తూరి అబ్బినది. పదములను స్పష్టంగా ఉచ్చరించగల్గుతున్నారు. గ్రామంలోని మిగిలిన పిల్లలందరూ సేవా పాఠశాల బాట పట్టారు.

• **పోలవరం మండలం:** పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మండలంలోని 5 గ్రామాలలో మత మార్పిడుల ప్రభావం అధికంగా వుండేది. విశేషించి బి.వి.కె. సేవా పాఠశాలలకువస్తున్న వింజరం, బోడిగూడెం పిల్లలు వారి పెద్దలపై ప్రత్యేక ప్రభావం చూపగలిగారు. పిల్లలు నిత్యం ఇంటి వద్ద ధ్యానం చేయడం, తల్లిదండ్రులకు

నమస్కరించడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం ఇవన్నీ వారి తల్లిదండ్రులను కదిలించాయి. వారు కూడా అదే కోవలో నడవడం మొదలు పెట్టి మళ్ళీ స్వధర్మంలోకి వచ్చారు.

• **గిరిజన యువకుల కొరకు నిర్వహించబడిన కార్యక్రమాలు:** భారతీయ విద్యా కేంద్రం వనవాసీ క్షేత్రంలోని గ్రామాలలో కేవలం ఏకోపాధ్యాయ పాఠశాలల నిర్వహణకే పరిమితం కాకుండా యువత దృష్టిని గ్రామాలలో నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు మరల్చేందుకు కూడా కొంత ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రాంతంలో సాధారణంగా పాఠశాల విద్య పూర్తి చేసినవారిలో, చేయనివారిలో కూడా పాశ్చాత్య సంస్కృతీ పోకడలు వెర్రితలలు వేస్తుండటంతో పాటు, వీరిలో కొంతమంది తీవ్రవాదం వైపు మొగ్గు చూపుతున్న సందర్భాలు, తీవ్రవాద బృందాల్లో చేరి తుపాకీ గురిపెట్టడంలో శిక్షణ పొందిన దాఖలాలు కూడా వున్నాయి. ఈ విషయాలనుండి, వారిని మంచి మార్గం వైపు తీసుకెళ్ళాలనే ప్రయత్నంలో భాగంగా మూడు సంవత్సరాలు వరుసగా 45 గ్రామాలను సంపర్కం చేసి యువకులకు వాలీబాల్ మరియు కబడ్డీ స్పర్థలు నిర్వహించుట జరిగినది. ఈ పోటీలలో పాల్గొన్న మొత్తం 35 బృందాలకు సంబంధించిన క్రీడాకారులకు కేవలం 20 మంది విద్యార్థులతో ఏకోపాధ్యాయ పాఠశాల నడుపబడుతున్న ఇరడాపల్లి కొత్తవూరు (పాడేరు మండలం) గ్రామస్థులు భోజన వ్యవస్థ మరియు ఇతర ఉత్సవ ఏర్పాట్లు చేశారు. ఈ పోటీల సమయంలో ఆ గ్రామంలోని మహిళలు, పురుషులు బృందాలుగా ఏర్పడి బాధ్యతలను పంచుకొని ఒక పండుగలా ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారు. భారతీయ విద్యా కేంద్ర అధికారుల ద్వారా గ్రామ వికాసంలో యువత బాధ్యతను తెలియజేస్తూ క్రీడా పోటీలలో పాల్గొన్న వారికి దిశానిర్దేశం చేయబడినది.



• **గిరిజన బాలల సమ్మేళనం:** పాడేరులో 2 రోజుల పాటు నిర్వహించబడిన ఏకోపాధ్యాయ పాఠశాలల విద్యార్థుల సమ్మేళన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అప్పటి ఐ.టి.డి.ఎ డిప్యూటి డైరెక్టర్, గిరిజన బాలలు ప్రదర్శించిన శారీరిక, బౌద్ధిక అంశాలను చూసి ముగ్ధులై, పాడేరులోని బి.వి.కె. ఉన్నత పాఠశాలను 'Best Available School' జాబితాలో చేర్చుటకు దరఖాస్తు చేయవలసినదిగా సూచించి, తదుపరి

మిగిలిన పనిని వారే పూర్తి చేసి BAS స్కీమ్‌లో బి.వి.కె. పాఠశాలను చేర్చుతూ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతిని భారతీయ విద్యా కేంద్ర యాజమాన్యానికి అందించడం ఆనందించదగిన విషయం.






• **విజ్ఞానభారతి పాఠశాల, పాడేరు (BAS):** పాడేరులోని విజ్ఞానభారతి పాఠశాల పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో వరుసగా ప్రతి సంవత్సరం గిరిజన ప్రాంతంలోని 11 మండలాలలోకెల్లా ఉత్తమ ఫలితాలు సాధించిన కారణంగా మరియు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే Best Available Schoolగా గుర్తించబడినది. ఈ పథకం ద్వారా ఈ పాఠశాలకు ITDA వారిచే 200 మంది విద్యార్థులను కేటాయించుట జరిగినది. వీరందరికీ వంతాడపల్లి హాస్టల్‌లో వసతి, విజ్ఞానభారతి పాఠశాలలో తరగతులు నిర్వహించబడినవి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారిన తరువాత ఈ పథకం రద్దు చేయబడినది. ప్రస్తుతం బి.వి.కె. పూర్వ విద్యార్థులు, శ్రేయోభిలాషుల సహకారంతో ఈ హాస్టల్‌లో 25 మంది అనాధ గిరిజన బాలురు విద్యనభ్యసిస్తున్నారు. ఈ హాస్టల్ నిర్వహణ కారణంగా మనకు అనేక గ్రామాలలో పనిచేయుటకు సంబంధాలు ఏర్పడినవి.



ఏకోపాధ్యాయ పాఠశాల జి-పెదబయలు

• **జి-మాడుగుల ప్రాథమిక పాఠశాల ప్రారంభానికి ప్రేరణ:** మొదటి నుండి భారతీయ విద్యా కేంద్రంచే గిరిజన క్షేత్రంలో నడుపబడుతున్న పాఠశాలను, ఆ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వ్యక్తిత్వాన్ని, బి.వి.కె. ద్వారా నిర్వహింపబడుతున్న సేవా కార్యక్రమాలను, ఆ కార్యక్రమాల ద్వారా ఆయా గ్రామాలలో వస్తున్న మార్పును

ప్రత్యక్షంగా గమనించిన జి-మాడుగులకు చెందిన మాజీ మంత్రివర్యులు శ్రీమతి మత్స్యరాస మణికుమారి తన స్వంత గ్రామమైన జి-మాడుగుల లో పాఠశాల ప్రారంభించమని భారతీయ విద్యా కేంద్ర యాజమాన్యాన్ని కోరడమేగాక తమ స్వంత స్థలాన్ని పాఠశాల భవన నిర్మాణానికి ఉచితంగా యిచ్చారు.

• సాక్షరతాదిశగా........

గిరిజన క్షేత్రంలో బి.వి.కె. సంస్కార కేంద్రములు ప్రారంభించే నాటినుండి కొన్ని సంవత్సరముల వరకు గిరిజన గ్రామాలలో అక్షరాస్యుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ప్రభుత్వ పాఠశాలలున్నప్పటికీ అనేక గ్రామాలలో పిల్లలు పాఠశాలలకు వెళ్ళేవారు కాదు. కానీ సేవా పాఠశాలల ప్రారంభం తరువాత ఆచార్యుల విశేష ప్రయత్నం వలన అనతికాలంలోనే ఈ పరిస్థితి మారి, పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్ళడం, సేవా పాఠశాలకు రావడం ప్రారంభించారు. ఇదేకాకుండా పదవ తరగతి అనంతరం కూడా చదువును కొనసాగిస్తూ, ఉన్నత విద్యలనభ్యసించడం చెప్పుకోదగ్గ పరిణామం. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు అనేక మంది ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాలు పొంది ఉన్నత చదువులు పూర్తి చేసుకోవటంతో పాటు ప్రస్తుతం అనేక మంది ప్రభుత్వోద్యోగాలు చేస్తున్నారు.

## సముద్రతీర గ్రామాలు-పరివర్తన

• ముత్యాలమ్మపాలెం (పరవాడ మండలం): బి.వి.కె. ద్వారా సేవా పాఠశాల ప్రారంభించిన పిదప ముత్యాలమ్మపాలెం గ్రామంలో నిర్వహణ సరిగా లేని ఆలయం వద్ద శ్రీరామనవమినాడు 3సంవత్సరాల పాటు శ్రీరామకళ్యాణం నిర్వహించిన కారణంగా, ఆ తదుపరి కాలఖండంలో గ్రామస్థులే స్వయంగా నడుంబిగించి ఆలయాన్ని బాగుచేసుకుని శ్రీరామకళ్యాణాన్ని స్వయంగా నిర్వహించుకుంటున్నారు. మొదట్లో పాఠశాలలో ఆచార్యులు పిల్లలను వెంటబెట్టుకుని ఇంటింటికి వెళ్ళి గ్రామస్థులను కళ్యాణోత్సవానికి ఆహ్వానించేవారు. అయినప్పటికీ వారు రావడానికి జంకేవారు. కానీ నేడు ఆ పరిస్థితి మారింది. గ్రామస్థులందరూ భక్తి శ్రద్ధలతో ఆలయంలో జరిగే కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.

కొందరు విద్యార్థుల ఇళ్ళలో తులసి మొక్కలు నాటి పూజించడం మొదలు పెట్టారు. వారిని చూసి మరికొందరు వారి ఇళ్ళలో కూడా తులసి మొక్కలు నాటి పూజిస్తున్నారు. ఈ గ్రామంలో సేవా పాఠశాల ప్రారంభం నాటికి రెండు విదేశీ మతానికి చెందిన కుటుంబాలుండేవి. ప్రస్తుతం అన్నీ హిందూ కుటుంబాలే కావడం విశేషం. సేవా పాఠశాల ప్రారంభానికి పూర్వం ఈఊరిలో 10వ తరగతి వరకు

చదివిన వారు కూడా కనిపించే వారు కాదు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అందరిలో చదువుకోవాలనే ఆకాంక్ష పెరిగి, ఉన్నత విద్యలనభ్యసిస్తున్నారు.

**అంతర్జాతీయ సముద్ర తీర పరిశుభ్రతా దివస్:** అంతర్జాతీయ స్వచ్ఛసాగర్-సురక్షాసాగర్ దివస్ సందర్భంగా ప్రతి సంవత్సరం సెప్టెంబరు 17వ తేదీన భారతీయ విద్యా కేంద్ర సేవా విభాగం ఆధ్వర్యంలో శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ జిల్లాలలోని సముద్ర తీర గ్రామాలలో ఏకోపాధ్యాయ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు కలిసి సముద్రతీరంలోని వ్యర్థాలను తీసి శుభ్రం చేస్తారు. సముద్ర తీర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతున్నది.





- **అరట్లకోట:** ఏకోపాధ్యాయ పాఠశాల నిర్వాహకురాలిగా (పాయకరావుపేట మండలం) చేరిన పిదప పిల్లలకు మంచి విషయాలు చెప్పడంతో పాటు నేను కూడా మనదేశం గురించి, ధర్మం గురించి, సంస్కృతి సంప్రదాయాల గురించి చాలా నేర్చుకున్నానని ఈ పాఠశాల నిర్వాహకురాలు మోహిని చెబుతూ, ఇందుకు భారతీయ విద్యా కేంద్రానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు.

- **వెంకటపతిపాలెం (పరవాడ మండలం):** ఈ గ్రామంలో పిల్లలు సేవా పాఠశాల ప్రభావం వలన చదువులో మంచి ప్రతిభను కనబరుస్తున్నారు. ఇక్కడి పిల్లలు ఏరకమైన ప్రత్యేక శిక్షణ లేకుండా నవోదయ పాఠశాలల ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరచి, అక్కడ ప్రవేశాలను పొంది చదువును కొనసాగిస్తున్నారు.

- **ధర్మారాయుడుపేట (పరవాడ మండలం):** ఇక్కడి సేవా పాఠశాల పిల్లలు తెలుగు పదాల ఉచ్చారణలో, వ్రాయడంలో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ గ్రామం నుండి కూడా పిల్లలు నవోదయ పాఠశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులై ప్రవేశాలు పొందుతున్నారు. చదువు కొనసాగిస్తున్నారు.

• బి.వి.కె. సేవా విభాగం ద్వారా పాఠశాలలు పరవాడ మండలంలోని మత్స్యకార గ్రామాల్లో ప్రారంభించే నాటికి ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, జాలారిపేట గ్రామాల్లో 13 అన్యమత కుటుంబాలు ఉండేవి. ప్రస్తుతం ఆ గ్రామాలలో విదేశీమతం పుచ్చుకున్నవారు, వారి తప్పిదాన్ని తెలుసుకుని పాఠశాల ఆచార్యుని ద్వారా అందరూ తిరిగి స్వధర్మంలోకి రావడం వలన ఆ గ్రామాలు సంపూర్ణ హిందూ గ్రామాలుగా మారాయి.



• ఈదటం (పాయకరావుపేట మండలం): సేవా పాఠశాల ప్రభావం వలన పాఠశాలలో పిల్లలకు తెలుగు బాగా చదవటం, వ్రాయటం వచ్చింది. ఈ విషయంలో తల్లిదండ్రులు ఆనందిస్తున్నారు. గణితంలో కూడా మంచి ప్రతిభను కనబరుస్తున్నారు.

• పెదరామభద్రపురం కొత్తూరు(పాయకరావుపేట మండలం): ఈ గ్రామంలో పిల్లలు ఏకోపాధ్యాయ పాఠశాలకు రావడం వల్ల ప్రభుత్వ పాఠశాలలో ఇచ్చిన 'ఇంటిపనిని సక్రమంగా చేస్తున్నారని, నేర్చుకున్న విషయాలన్నీ ధైర్యంగా చెబుతున్నారని ప్రతిరోజూ చదవడం అలవాటైందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

• సీతారాంపురం (పాయకరావుపేట మండలం): ఇక్కడి సేవా పాఠశాలలో పిల్లలు నేర్చుకున్న విషయాలను స్వయంగా పరిశీలించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆశ్చర్యచకితులైనారు. ప్రభుత్వ పాఠశాలలోని పిల్లలందరినీ సేవా పాఠశాలకు వెళ్ళమని వారు ప్రోత్సహిస్తున్నారు.

• మార్సయ్యపేట (పాయకరావుపేట మండలం): సేవా పాఠశాలకు రావడం ప్రారంభించాక పిల్లలు ప్రతిరోజూ ఈ ఊరు దేవాలయాన్ని శుభ్రం చేయడం, కళాపుచల్లి ముగ్గులు పెట్టడం వంటివి చేస్తున్నారు. సేవా కేంద్రానికి వచ్చి విషయాలను శ్రద్ధగా నేర్చుకుంటున్నారు. ఆచరిస్తున్నారు.

• రాజవరం (పాయకరావు పేట): ఇక్కడ సేవా పాఠశాల ప్రారంభ దినాలలో పిల్లలలో ఉన్న ఎన్నో అవగుణాలు క్రమక్రమంగా కనుమరుగయ్యాయి, చదువుపై వారు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ప్రతిరోజు క్రమం తప్పక పాఠశాలకు వస్తున్నారు, నేర్చుకోవడంపై ఆసక్తి పెరిగింది.

• **మంగవరం (పాయకరావుపేట మండలం):** ఇక్కడ సేవాబస్తీలోని పాఠశాల నిర్వాహకురాలు గంగారత్నం వారి గ్రామంలో మోసపూరితంగా విదేశీ మతంలోకి మారిన కొంత మంది స్త్రీలను, పిల్లలను హిందూత్వంలోనికి పునరాగమనం చేయించారు.

• **రేబాక (నక్కపల్లి మండలం):** ఈ సేవా పాఠశాల నిర్వాహకురాలు కుమారి సాదిరెడ్డి భార్గవి స్వయంగా భగవద్గీతలోని 1,7,8 అధ్యాయాలను బాగా అధ్యయనం చేసింది. అందువలన ఈ పాఠశాలలోని 30 మంది పిల్లలు 40 భగవద్గీత శ్లోకాలను అనర్గళంగా చెప్పగలుగుట విశేషం. దేవాలయంలో పండుగల సందర్భంగా పిల్లలు నేర్చుకున్న భగవద్గీత, వివిధ అష్టకాలు, భజనలు దేవాలయం మైక్‌లో పాడుతుంటే, ఇంత కష్టమైన విషయాలను అంత అవలీలగా పిల్లలు ఎలా చెప్పగలుగుతున్నారని గ్రామస్థులందరూ ఆశ్చర్యపోతున్నారని, తనను చాలా గౌరవంగా చూస్తున్నారని నిజానికి ఈ విషయాలన్నీ నేను కూడా భారతీయ విద్యా కేంద్రం నిర్వహిస్తున్న మాస వర్గలలో నేర్చుకున్నవేనని సేవా పాఠశాల నిర్వాహకురాలు చెప్పారు.

• **దేవవరం (నక్కపల్లి మండలం):** ఈ సేవా పాఠశాలలో పిల్లలు చదవడంలో, వ్రాయడంలో ఆచార్యుని ప్రయత్నం ద్వారా మంచి నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. సేవా కేంద్రంలో చెప్పిన ప్రతి విషయాన్ని శ్రద్ధగా వినడంతో పాటు, ఆచరించడం కూడా వీరి ప్రత్యేకత. తల్లిదండ్రులందరూ వారి పిల్లలలో వచ్చిన మార్పుకు ఆనందిస్తున్నారు.

• **దొంకాడ (నక్కపల్లి మండలం):** ప్రతి శనివారం పిల్లలు గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్ళి విష్ణు సహస్రనామ పారాయణం చేయటం అలవాటు చేసుకున్నారు.

• **రమణయ్యపేట (నక్కపల్లి మండలం):** ఈ గ్రామంలో సేవా పాఠశాల ప్రారంభించిన అనంతరం పత్యేకించి ఎస్.సి. కాలనీలో విదేశీమతం స్వీకరించిన కుటుంబాలను సంపర్కం చేసి వారి పిల్లల్ని కూడా సేవా పాఠశాలకు పంపమని అడుగగా వారు తిరస్కరించారు. అయితే 10 రోజుల పాటు ఆచార్యుడు వారిళ్ళకు వెళ్ళి సంపర్కం చేయడంవలన, పాఠశాల గురించి తెలుసుకుని వారే (తల్లిదండ్రులే) స్వయంగా పిల్లల్ని పాఠశాలకు తీసుకువచ్చారు. పిల్లల్లో మొండితనం, పెద్దల్ని ఎదిరించి మాట్లాడటం వంటి దురుసు లక్షణాలు తగ్గాయని తల్లిదండ్రులు చెప్పారు. ప్రతినెలలో ఏకాదశి రోజున గ్రామస్థులు సేవా పాఠశాల పిల్లలతో నగర సంకీర్తన చేయడంతో పాటు, సాయంత్రం పెద్దలతో, పిల్లలు కలిసి దేవాలయంలో సామూహిక హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గ్రామస్థులందరూ భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

• **తీర ప్రాంత గ్రామాల యువకులకు కార్యక్రమాలు:** భారతీయ విద్యా కేంద్రం ప్రయత్నం ద్వారా వనవాసీ క్షేత్రంలో సత్ఫలితాలనిచ్చిన యువకుల కొరకు నిర్వహించిన కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని సముద్ర తీర గ్రామాల యువకులకు కూడా ఒకరోజు సమ్మేళనాలు మరియు వాలీబాల్ పోటీలు నిర్వహించబడినవి. ఒకరోజు సమ్మేళనాలు తీర ప్రాంత గ్రామాలలో మంచి మార్పుకు దోహద పడ్డాయి. దీని వలన సముద్ర తీర గ్రామాలలో విచ్చలవిడిగా జరుగుతున్న మత మార్పిడులను స్థానికులే ప్రతిఘటిస్తున్నారు. మోసపూరిత మతాంతరీకరణలను ప్రోత్సహిస్తున్న వారిని, వారి గ్రామాలలో ప్రవేశించనీయకుండా స్థానిక యువకులు కట్టడి చేయడం గమనార్హం.

• **చింతకాయల పేట(తొండంగి మండలం):** ఈ గ్రామంలో సేవా కేంద్ర విద్యార్థులందరూ ఉదయాన్నే లేవగానే ప్రాతఃస్మరణలోని మొదటి రెండు శ్లోకాలను చెప్పి తల్లిదండ్రులకు నమస్కరించి పిల్లలు దినచర్యను ప్రారంభిస్తున్నారు.

• **కృష్ణాపురం (తొండంగి మండలం):** సేవా పాఠశాలకు వచ్చే పిల్లలు ఎక్కువ మంది విదేశీ మతం స్వీకరించినప్పటికీ మనం చెప్పే శ్లోకాలు, పద్యాలు, అష్టకాలు మిగిలిన పిల్లలతో కలిసి ఎంతో శ్రద్ధతో నేర్చుకుంటున్నారు. ఇది గమనించిన పిల్లల తల్లిదండ్రులు కూడా ఆనందిస్తున్నారు. వారు కూడా భజన కార్యక్రమాలలో ఒక్కొక్కరుగా పాల్గొంటున్నారు.

• **వేమవరం (తొండంగి):** ఇక్కడ పిల్లలు మొదట్లో వారి తల్లిదండ్రులను అగౌరవ పదజాలంతో సంభోదించేవారు. క్రమంగా సేవా పాఠశాల ప్రభావం వలన ఆ పరిస్థితి మారి ఇప్పుడు గౌరవ భావంతో పిలుస్తున్నారు. పాఠశాలకు వచ్చిన వెంటనే ఆ స్థలాన్ని శుభ్రం చేయడం, పాఠశాలలో "జైశ్రీరామ్" అని నల్లబల్లపై వ్రాయడం ప్రతిరోజూ చేస్తున్నారు.

• **యల్లయ్యపేట (తొండంగి మండలం):** యల్లయ్యపేట పాఠశాల నిర్వాహకురాలు అనూరాధ బి.వి.కె. మాస వర్గలలో ఇస్తున్న శిక్షణ వలన, పాఠశాలలో నేర్పే విషయాల ప్రభావం వలన, హిందుత్వంలోకి పునరాగమనం చేసారు.

• **గోకులపాడు (ఎస్. రాయవరం మండలం):** నా చిన్నప్పటి నుండి నాకు "టీచర్" అవ్వాలనే కోరిక ఉండేది. అది భారతీయ విద్యా కేంద్రం సేవా పాఠశాల ద్వారా సాకారమైంది. మొదట్లో మా సేవా పాఠశాల పిల్లలు అసలు మాట వినేవారు కాదు. అల్లరి విపరీతంగా చేసేవారు. కాలక్రమంలో మంచి విషయాలు చెప్పటం ప్రారంభించాక

వారిలో మంచి మార్పును గమనించాను. గ్రామస్థులు, తల్లిదండ్రులు కూడా పిల్లల్ని తీర్చిదిద్దడంలో నా ప్రయత్నాన్ని కొనియాడుతున్నప్పుడు, నా ఆనందానికి అవధులు లేవని పాఠశాల నిర్వాహకురాలు బి.యశస్విని చెప్పారు.

• **ఎస్. అన్నవరం (తుని మండలం):** ఈ గ్రామంలో పిల్లలు సెలవు రోజుల్లో సేవా కేంద్రానికి కూడా వచ్చి కొత్త విషయాలు చెప్పమని అడుగుతున్నారు. ఇక్కడ చెప్పే కథలు, సంస్కృతికి సంబంధించిన విషయాల వలన వారి ప్రవర్తనలో, వారి అలవాట్లలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

• **కొత్తపట్నం(రాంబిల్లి మండలం):** ఈ ఊరిలో ఏకోపాధ్యాయ పాఠశాలతో పాటు, మత్స్యకార యువకులకు రాత్రి పాఠశాల జరిగేది. బి.వి.కె. వారికున్న NIOS గుర్తింపు ద్వారా ఓపెన్ స్కూల్ విధానంలో 3,5,8 తరగతులలో సేవా పాఠశాలలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్స్ కూడా ఇవ్వబడినవి. ఈ యువకుల ప్రయత్నం వలన ఆయా గ్రామాలలో ధార్మిక కార్యక్రమాలు బాగా నిర్వహించబడుతున్నాయి.

• **మూలజంప(రాంబిల్లి మండలం):** ఈ గ్రామంలో సేవా పాఠశాల ప్రారంభించాక, పాఠశాల ప్రభావం వలన ఈ ఊరిలో స్వస్థత్ కూటముల నిర్వహణ ఆగింది. గ్రామస్థులందరూ దేవాలయ కేంద్రంగా ధార్మిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు.

**మత్స్యకార యువకులకు ఉపాధిపై అవగాహన:**

• రాంబిల్లి, పూడిమడక, అచ్యుతాపురం, వాడ నరసాపురం మొదలగు మత్స్యకార గ్రామాలలో సముద్రంలో వేటకు వెళ్ళే యువకులకు విశాఖలోని జనశిక్షణ సంస్థాన్ సహకారంతో రొయ్యలు వివిధ రకాల చేపలను నిల్వ ఉంచే పద్ధతులను మరియు వాటితో నిల్వపచ్చళ్ళు తయారు చేసే విధానం పట్ల అవగాహనా కార్యక్రమములు నిర్వహించబడినవి.

• **వెంకయ్యపాలెం (అచ్యుతాపురం మండలం):** భారతీయ విద్యా కేంద్రం ద్వారా రాంబిల్లి మండలంలోని వెంకయ్యపాలెంలో గ్రామస్థులచే రామాలయాన్ని నిర్మించడానికి ప్రోత్సహించి ఆ దేవాలయానికి భారతీయ విద్యా కేంద్రము ద్వారా విగ్రహాలు అందజేయబడినవి. గ్రామస్థులు విరాళాలు సేకరించి ఆలయం నిర్మించుకున్నారు. ప్రభావవంతమైన సేవా పాఠశాల నిర్వహణ ద్వారా ఈ గ్రామం వ్యసన రహిత గ్రామంగా మారింది.

• **ధార్మిక జాగరణ:** ఉచిత పాఠశాలల నిర్వాహకులు రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, ఉగాది, విజయదశమి, శ్రీరామనవమి, సంక్రాంతి ఉత్సవాలను భారతమాత పూజా కార్యక్రమాలను ఆయా గ్రామాలలో నిర్వహిస్తూ గ్రామస్థులందరూ పాల్గొనేలా చేసి, గ్రామాలను సామాజికంగా, ధార్మికంగా చైతన్యవంతం చేస్తున్నారు.






• **తంతడి (అచ్యుతాపురం మండలం):** సేవా పాఠశాల ప్రభావం కారణంగా గ్రామంలోని పాడుబడిన శ్రీకృష్ణుడి గుడిని శుభ్రం చేసి గ్రామస్థుల చేత ప్రతి సంవత్సరం 40 రోజులు కృష్ణ దీక్షలు చేసేటట్లు ప్రోత్సహించడమైనది. అధికశాతం యువకులే ఈ దీక్షలు తీసుకోవడం గమనార్హం. మతాంతరీకరణలను నిరోధించడంలో యువకులు విజయం సాధించారు.

• **దాతల ఔదార్యం:** 1) ముత్యాలమ్మపాలెం (పరవాడ మండలం) సేవా పాఠశాల విద్యార్థుల ప్రతిభను ప్రత్యక్షంగా చూసిన శ్రీ గొల్లపల్లి సుబ్రమ్మణ్యేశ్వరరావు (విశాఖ) సేవా పాఠశాల నిర్వహణకు సముద్ర తీరంలో నాలుగు గదుల షెడ్‌ను నిర్మించి యిచ్చారు.

• 2) వాడచీపురుపల్లి (పరవాడ మండలం) సేవా పాఠశాలను సందర్శించిన ఎన్.టి.పి.సి (పరవాడ) ఉద్యోగులు అక్కడి విద్యార్థుల విద్యా విషయ ప్రతిభను స్వయంగా చూసి ముగ్ధులై ఒక సేవా ట్రస్టును ఏర్పాటు చేసి ఈ పాఠశాలకు పూర్తి మద్ధతును ఇవ్వడమే గాక, 16 లక్షల రూపాయలతో పక్కా భవనాన్ని స్వయంగా కట్టించి యిచ్చారు. తదుపరి ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు కూడా వారే ప్రయత్నించి తీసుకొచ్చారు. ఈ పాఠశాలలో విద్యార్థులు గణితంలో విశేష ప్రతిభను కనబరుస్తారు. ఆంగ్లం, తెలుగులో కూడా సాధారణ పాఠశాలల విద్యార్థుల కంటే ఉత్తమ స్థితిలో ఉంటారు. సేవా కేంద్రముల విద్యార్థుల సందర్శనలో భాగంగా వాడచీపురుపల్లిలో జరిగిన మత్స్యకార బాలల సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యాభారతి అఖిలభారత సంఘటనా కార్యదర్శి మాననీయ బ్రహ్మదేవ్‌శర్మ మత్స్యకార బాలలు అనర్గళంగా పఠించిన వివిధ అష్టకములను, భగవద్గీత శ్లోకములను మరియు గణితమునకు సంబంధించి

ప్రదర్శించిన అనేక విషయములను పరిశీలించి “మట్టి నుండి మాణిక్యాలను తీయడం అంటే ఇదే” అనే మాటలతో ఆనాడు వారి ఉపన్యాసం ప్రారంభించడం గమనించదగిన విషయం.






• **సేవా కేంద్రాల నిర్వాహకుల శిక్షణ – ప్రభావం:** గిరిజన మరియు తీర ప్రాంతాలలోని ఏకోపాధ్యాయ పాఠశాలల నిర్వాహకులకు భారతీయ విద్యా కేంద్రం యిస్తున్న చిన్నపాటి శిక్షణతో, సంస్థ పద్ధతుల పట్ల ఏరకమైన అవగాహన లేని యువతీయువకులు ఈ శిక్షణ పొందడం ద్వారా అద్భుతాలు సృష్టిస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పని చేస్తున్న ఆచార్యులందరికీ కేవలం నెలకు ఒకరోజు, ఆ నెలలో బోధించవలసిన అంశాలపై శిక్షణ ఇవ్వబడుతోంది. వారు స్వయంగా పాఠశాలలో చదువుతున్న రోజుల్లో కూడా టెక్స్ట్ పుస్తకాల్లోని పద్యాలు, శ్లోకాల పట్ల శ్రద్ధ పెట్టి ఉండరు – కానీ ఈ యువతీయువకులు మన శిక్షణలో భాగంగా వివిధ అష్టకాలు, బాలరామాయణ మరియు భగవద్గీత శ్లోకాలు, శతక పద్యాలు, దేశభక్తి గేయాలు మొదలగునవి నేర్చుకోవడంతో పాటు విద్యార్థులచే శ్రద్ధగా అభ్యాసం చేయించడం, వీటితో పాటు యోగాసనాలు, ఇతర వ్యాయామాలు మరియు ఆటలు కూడా వారు స్వయంగా నేర్చుకొని పిల్లలకు చక్కగా నేర్పడం విశేషం. వీటితో పాటు తెలుగు, గణితం, ఆంగ్లం వంటి విషయాల బోధన కూడా చేస్తున్నారు. ఈ విధంగా సంస్థ లక్ష్యాలను ఆకళింపు చేసుకుని, అత్యంత శ్రద్ధతో ప్రతిరోజు రెండు గంటల పాటు ఏకోపాధ్యాయ పాఠశాలలను నిర్వహిస్తూ, తద్వారా భారతీయ విద్యా కేంద్రం ఆయా గ్రామాలలో ఆశించిన పరివర్తనను సాకారం చేసి చూపిస్తున్నారు.









• **ఉచిత వైద్య శిబిరములు:** బి.వి.కె. కళాశాలలో చదివి వైద్యులుగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు, భారతీయ విద్యా కేంద్రం ద్వారా సముద్ర తీర ప్రాంతంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు నిర్వహింపబడుతున్న గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. అదే విధమైన ప్రేరణతో గిరిజన గ్రామాలలో బి.వి.కె. చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్న విశాఖలోని గాయత్రి విద్యా పరిషత్‌కి అనుబంధంగా ఉన్న మెడికల్ కాలేజీకి హాస్పిటల్ వైద్యులు, అల్లూరి జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు నిర్వహింపబడుతున్న గ్రామాలలో 3సంవత్సరాల పాటు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడమేగాక, ఆయా గ్రామాలలో దీర్ఘవ్యాధులతో బాధపడుతున్న గిరిజన బంధువులను సొంత ఖర్చులతో తమ వాహనాలలో విశాఖపట్టణంలోని వారి ఆసుపత్రికి తీసుకువచ్చి వారికి ఉచిత వైద్య సేవలందించి, వ్యాధి తగ్గిన పిమ్మట స్వగ్రామానికి పంపించేవారు. అదే విధంగా అనేక సంవత్సరాలుగా వివేకానంద మెడికల్ ట్రస్టు, విశాఖపట్టణం వారు కూడా ప్రతి నెలలో రెండు పర్యాయములు పాడేరు మండలంలోని  ఏకోపాధ్యాయ పాఠశాలలు జరుగుతున్న కొన్ని గ్రామాలలో మరియు అల్లూరి సీతారామరాజు ఉచిత ఆవాసంలో విద్యార్థులకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు.



• **బి.వి.కె. కళాశాలల పూర్వ విద్యార్థుల ఔదార్యం:** విశాఖ నగరంలోని బి.వి.కె. కళాశాలల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ, వ్యాపారాదులలో స్థిరపడిన అనేక మంది పూర్వ విద్యార్థులు, మన కళాశాలలో

చదువుతూ ఆర్థికంగా వెనుకబడిన అనేక మంది ప్రస్తుత విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, యూనిఫామ్‌ను అందజేయడంతో పాటు కొంత మంది విద్యార్థులకు కళాశాల ఫీజును కూడా వారే చెల్లించి తమ సేవా భావాన్ని , సోదర భావాన్ని చాటుకుంటున్నారు.




• **బి.వి.కె. డిగ్రీ కళాశాల విద్యార్థుల స్వచ్ఛంద రక్తదానం**: 2005వ సంవత్సరం నుండి కళాశాల బోధనా సిబ్బంది ఇచ్చిన ప్రేరణతో ప్రతి సంవత్సరం జనవరి 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని (జాతీయ యువ దినోత్సవం) పురస్కరించుకుని డిగ్రీ కళాశాలలో చదివే కనీసం 50 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయటం అలవాటుగా మార్చుకున్నారు. రక్తదానం చేస్తున్న విద్యార్థుల సంఖ్య కొన్ని సమయాల్లో 100 నుండి 150 వరకు కూడా ఉండటం గమనార్హం. ఈ రక్తాన్ని సురక్షితంగా ఉంచి అవసరమైన వారికి వినియోగించుట కొరకు విశాఖలోని రిజిష్టర్డు బ్లడ్‌బ్యాంకు వారికి పంపుట జరుగుతున్నది. ఇదేగాక మన విద్యార్థులు విశాల హృదయంతో మరొక అడుగు ముందుకేసి, కె.జి.హెచ్. (కింగ్ జార్జ్ హాస్పిటల్) వంటి ప్రభుత్వ వైద్యాలయాలలో చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితిలో ఉండి అత్యవసరంగా రక్తం అవసరమైన రోగుల బంధువులు మన కళాశాలకు వచ్చి రక్తం కొరకు అభ్యర్థించిన వెంటనే మన విద్యార్థులు తరగతి నుండి నేరుగా ఆసుపత్రికి వెళ్లి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తూ ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు.






• **రౌండ్‌టేబుల్ ఇండియా వారి ఔదార్యం:** గిరిజన గ్రామాలలో భారతీయ విద్యాకేంద్రం ద్వారా నిర్వహింపబడుతున్న సేవా కార్యాక్రమాలను గురించి తెలుసుకొని ప్రభావితులైన రౌండ్‌టేబుల్ ఇండియా-77,213 టేబుల్స్ వారు అల్లూరి జిల్లాలోని పాడేరు, హుకుంపేట, అరకువేలీ, వంతాడపల్లి, చింతపల్లి గ్రామాలలో మరియు మన్యం పార్వతీపురం జిల్లాలోని కురుపాం, బత్తిలి గ్రామాలలో పాఠశాల భవనాల నిర్మాణానికి ముందుకు వచ్చి నిర్మాణానికి అయిన ఖర్చులో సగ భాగాన్ని విరాళంగా ఇవ్వడంతోపాటు, హుకుంపేట, పాడేరు పాఠశాలల్లో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లను, డిజిటల్ క్లాస్ నిర్వహణ కొరకు బోర్డులను కూడా ఏర్పాటు చేసి గిరిజన బాలల విద్యా వికాసంలో భాగస్వాములు కావడం చెప్పుకోదగ్గ విషయం.





• **బాల వికాస కేంద్రముల నిర్వహణ:** కరోనా (కోవిడ్) సమయంలో పాఠశాలలు మూసి వేసిన కారణంగా పిల్లల్లో ఏర్పడిన (Learning gaps) అభ్యసన సంక్షోభాన్ని అధిగమించేందుకు, పిల్లలు నివసిస్తున్న ప్రాంతాల సమీపంలోనే బాల వికాస కేంద్రాలను నిర్వహించాలని రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ అఖిల భారత అధికారులు, విద్యాభారతి, సేవాభారతి వంటి సంస్థలకు ఇచ్చిన పిలుపు మేరకు విద్యాభారతి, ఆంధ్రప్రదేశ్‌కి అనుబంధంగా ఉన్న అన్ని సమితుల పాఠశాలల ద్వారా ఈ కేంద్రములు నిర్వహించబడినవి. ఈ సందర్భంగా భారతీయ విద్యా కేంద్ర సమితి పాఠశాలల ద్వారా అత్యధికంగా 287 బాల వికాస కేంద్రములు నిర్వహించబడినవి. ఈ కేంద్రాలకు ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యేవారు. అనంతరం నిర్వహించిన అనువర్తి కార్యక్రమంలో భారతీయ విద్యా కేంద్రం ద్వారా నిర్వహింపబడిన ఈ బాల వికాస కేంద్రాల వలన తమ పిల్లలు మరల చదువులో మామూలు స్థాయికి చేరుకున్నారని వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేసారు.

• ఏకోపాధ్యాయ పాఠశాలల పూర్వ విద్యార్థుల ప్రతిభ:

1) పరవాడ మండలం-వాడచీపురుపల్లి, గ్రామానికి సమీప గ్రామాలలో నిర్వహింపబడుతున్న ఏకోపాధ్యాయపాఠశాలల నుండి 2వ తరగతి వరకు చదివిన విద్యార్థులను వాడచీపురుపల్లి పాఠశాలకు తీసుకొచ్చి ఉచిత విద్యను అందించిన కారణంగా ఇప్పటి వరకు 217 మంది విద్యార్థులు రెసిడెన్షియల్ పాఠశాలల ప్రవేశ పరీక్ష వ్రాసి, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీట్లు సంపాదించి చదువు కొనసాగిస్తున్నారు.

2) బి.వి.కె. సేవా పాఠశాలల్లోప్రాథమిక విద్యను పూర్తి చేసి నవోదయ ఎంట్రన్స్ టెస్టు వ్రాసి ఇప్పటి వరకు 13 మంది జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశం పొంది విద్యను కొనసాగిస్తున్నారు.

3) వీరితో పాటు ఇతర గ్రామాలలోని సేవా పాఠశాలల్లో ప్రాథమిక విద్యను పూర్తి చేసిన 6గురు విద్యార్థులు ఐ.ఐ.ఐ.టి సీట్లు, సాధించి ప్రవేశం పొంది విద్యను పూర్తి చేసారు.

4) బి.వి.కె. ముత్యాలమ్మపాలెం సేవా పాఠశాల పూర్వ విద్యార్థులు చుక్క మోతీచంద్ర కోరుకొండ సైనిక్ స్కూల్లోను, చుక్క హేమలత, వాసుపల్లి సాయికుమార్, చీపురుపల్లి ఆనంద్ మరియు వాసుపల్లి పవన్‌కుమార్ విజ్ఞాన విహార, గుడిలోవ లాంటి ప్రతిష్ఠాత్మక రెసిడెన్షియల్ పాఠశాలలోను ప్రవేశం సంపాదించి చదువును కొనసాగిస్తున్నారు.

5) కూండ్రపు కుసుమ(నాయుడుపాలెం, పరవాడ మండలం) బి.వి.కె. సేవా పాఠశాలలో 5వ తరగతి వరకు చదివి తరువాత ఇంజనీరింగ్ పూర్తి చేసి ప్రస్తుతం ప్రతిష్ఠాత్మక సంస్థయైన ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తోంది.

6) బొంది మణికంఠ, దిబ్బపాలెం (పరవాడ మండలం) సేవా పాఠశాలలో 5వ తరగతి వరకు చదివాడు. ప్రస్తుతం చెన్నైలో టాటాగ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.

7) ఎ. రాజ్‌కుమార్, ముత్యాలమ్మపాలెం (పరవాడ మండలం)సేవా పాఠశాలలో 5వ తరగతి వరకు చదివి తరువాత ఉన్నత విద్యనభ్యసించి ప్రస్తుతం కోల్‌కత్తాలో, ఇండియన్ రైల్వేస్‌లో కంప్యూటర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.

8) లాలం స్వాతి, వాడచీపురుపల్లి (పరవాడ మండలం) సేవా పాఠశాలలో 5వ తరగతి చదివి, అనంతరం జిల్లాపరిషత్ హైస్కూల్లో చదువుకొని, ఐ.ఐ.ఐ.టిలో ప్రవేశించి విద్యాభ్యాసం పూర్తి చేసి ప్రస్తుతం ఇండియన్ రైల్వేలో ఉద్యోగం చేస్తున్నది.

9) కంబాల గంగోత్రి, జాలారిపేట (పరవాడ మండలం) దగ్గర 5వ తరగతి పూర్తి చేసి అనంతరం జెడ్.పి. హైస్కూల్లో చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి ఐ.ఐ.టి సీటు సంపాదించి చదువు పూర్తి చేసి, ఇప్పుడు ఇంజనీరింగ్ 4వ సంవత్సరం చదువుతున్నది.

10) కాకి సాయిాశ్య , వాడచీపురుపల్లి సేవా పాఠశాలలో 4వ తరగతి పూర్తి చేసి ఎ.పి. రెసిడెన్షియల్ స్కూల్ (తానాం)లో సీటు సంపాదించి చదువు పూర్తి చేసుకుని ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నది.

• **దొంకాడ కొత్తూరు:** విశ్వహిందూ పరిషత్, ఆర్య సమాజ్, గ్రామీణ వికాస్, చిన్మయ మిషన్, ఇస్కాన్ వంటి సంస్థలు కలిసి నిర్వహించిన భగవద్గీత, అష్టకములు, భర్తృహరి, సుభాషితములు, శతక పద్యపఠన పోటీలలో దొంకాడ కొత్తూరు ఏకోపాధ్యాయ పాఠశాల చిన్నారులు పాల్గొని, అన్ని విభాగాలలో ప్రథమస్థానం సాధించడం గమనించిన నిర్వాహకులు, ఇక్కడి సేవా కేంద్ర నిర్వాహకురాలిని వారి సంస్థలో పనిచేయాలని అందుకు బి.వి.కె. వారి కంటే రెట్టింపు వేతనం ఇస్తామని అడుగగా,"ఈ కేంద్రాన్ని డబ్బుల సంపాదన కోసం తాను నిర్వహించుటలేదని" కేవలం తన గ్రామంలోని పిల్లలకు కొన్ని మంచి విషయాలను చెప్పటానికి మాత్రమే ఈ పనిని గౌరవంగా భావించి చేస్తున్నానని" నిర్మొహమాటంగా చెప్పటం గమనించదగిన విషయం.

• **చినకర్రివానిపాలెం (కవిటి మండలం):** సేవా పాఠశాల ప్రభావం వలన ఇక్కడి పిల్లలు ప్రతినిత్యం భోజనానికి ముందు కాళ్ళు, చేతులు కడుక్కుని భోజనం చేసే అలవాటైంది. ఆడపిల్లలు చేతులకు గాజులు వేసుకుంటున్నారు. ముఖ్యంగా పిల్లల మాట తీరు మారింది. ఇక్కడ పెద్దలు కూడా వేలి ముద్ర మాని సంతకాలు చేయటం నేర్చుకున్నారు. పాఠశాల ప్రభావం వలన గ్రామంలోని ఆలయాన్ని వారానికొకసారి శుభ్రం చేసి భజన చేస్తారు.






• పెదకర్రివానిపాలెం: పాఠశాల ప్రభావం చేత ఇక్కడ పిల్లలు ప్రతిరోజు నిద్ర లేచిన వెంటనే ప్రాతఃస్మరణ చేస్తున్నారు. వ్యాయామం, యోగా చేస్తారు. 5గం॥ల నుండి 6గంటల వరకు చదువుకుంటారు. పిల్లలు పాఠశాలకు వెళ్ళే ముందు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్నారు. హిందూ సాంప్రదాయాలు పాటిస్తున్నారు. సమయానికి పాఠశాలకు వస్తున్నారు. ఆడపిల్లలు గాజులు వేసుకునే అలవాటు చేసుకున్నారు.





• సామాజిక బాధ్యత: కరోనా రెండవ దశలో సంభవించిన అతి భయంకరమైన పరిస్థితులను గమనించిన భారతీయ విద్యా కేంద్ర యాజమాన్యం, వివేకానంద మెడికల్ ట్రస్టు విశాఖ వారి సౌజన్యంతో విశాఖపట్నంలోని శ్రీకృష్ణ విద్యా మందిర్ పాఠశాలలో ఉచిత ఆక్సిజన్ సపోర్టెడ్ ఐసోలేషన్ సెంటర్‌ను నెల రోజుల పాటు నిర్వహించుట జరిగినది. ప్రాణాపాయ స్థితిలోవున్న కరోనా బాధితులకు నిరంతర ఆక్సిజన్ సరఫరాకు అనుగుణంగా తరగతి గదులలో పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసి అత్యవసర చికిత్స అందించబడినది. భారతీయ విద్యా కేంద్ర యాజమాన్యం పిలుపు మేరకు వెంటనే స్పందించిన పూర్వ విద్యార్థులు (విదేశాలలో ఉన్న వారు కూడా) ఈ ఐసోలేషన్ సెంటర్ నిర్వహణకు కావల్సిన మందులను, పి.పి.ఇ. కిట్స్‌ను, బెడ్‌షీట్స్, భోజన వసతి మరియు ఇతర ఏర్పాట్ల కొరకు వస్తు రూపంలో, ధనరూపంలో విరాళాలనందించి సాటివారి పట్ల వారి ఔదార్యాన్ని ప్రదర్శించారు. భారతీయ విద్యా కేంద్ర ప్రధాన కార్యాలయ సిబ్బంది నెల రోజుల పాటు అక్కడే వుండి బాధితులకు అల్పాహార, భోజన వ్యవస్థలను, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. బాధితులందరికీ, వైద్య సేవలతో సహా అన్ని

వ్యవస్థలు ఉచితంగా ఏర్పాటు చేయబడినవి. బాధితులందరూ చికిత్స అనంతరం క్షేమంగా పూర్తి ఆరోగ్యంతో ఇంటికి వెళ్ళడం జరిగింది.

"కార్పొరేట్ ఆసుపత్రులలో లక్షల్లో వసూలు చేసినప్పటికీ, కరోనా బారి నుండి బయట పడని వారిని మేము గమనించాము. కానీ మా వద్ద నుండి ఒక్క పైసా కూడా తీసుకోకుండా అనేక మంది స్వచ్ఛందంగా మా కొరకు రాత్రింబవళ్ళు అనేక సేవలందించి, మంచి మాటలతో స్వాంతన కలిగించి మా ప్రాణాలు నిలిపి మమ్మల్ని ఆనందంగా ఇంటికి పంపిస్తున్న మీ అందరికీ మా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని" చికిత్స పొందిన వారందరూ చెప్పారు.

పూర్వ విద్యార్థులతో పాటు, అప్పటికి కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, విద్యాలయాలలో పనిచేస్తున్న ఆచార్యులు యాజమాన్యం, పూర్వ ఆచార్యులు కూడా ఈ కోవిడ్ కేంద్ర నిర్వహణలో తమ ఇతోధిక సహకారాన్ని అందించి వారి సామాజిక బాధ్యతను నెరవేర్చారు. భారతీయ విద్యా కేంద్ర పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థులలో సంవేదనశీల నిర్మాణం ద్వారా వారు ఈ సామాజిక విపత్తును గుర్తించి, అవసరమైన సమయంలో స్వచ్ఛందంగా స్పందించి సహకారాన్ని అందించారు.





• **సేవా కేంద్రములను సందర్శించిన ప్రముఖులు:** భారతీయ విద్యా కేంద్రం ద్వారా వివిధ జిల్లాలలో నిర్వహింపబడుచున్న సేవా కార్యక్రమములను సందర్శించిన ప్రముఖులలో మాననీయ శ్రీ బ్రహ్మదేవ్‌శర్మ అఖిల భారత సంఘటనా కార్యదర్శి విద్యాభారతి, మాననీయ శ్రీ ప్రకాష్ చంద్ర అఖిల భారత సంఘటనా కార్యదర్శి విద్యాభారతి, మాననీయ శ్రీ జె.ఎమ్.కాశీపతి అఖిల భారత సంఘటనా కార్యదర్శి విద్యాభారతి, మాననీయ శ్రీ దూసి రామకృష్ణారావు అఖిలభారత అధ్యక్షులు విద్యాభారతి, విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి మాననీయ శ్రీ లింగం సుధాకరరెడ్డి, అదే విధంగా విద్యాభారతి ప్రాంత అధికారులు,

పాడేరు గిరిజన క్షేత్రంలో ఉంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రివర్యులుగా పనిచేసిన శ్రీమతి మత్స్యరాస మణికుమారి మరియు శ్రీ పసుపులేటి బాలరాజు, ఎమ్.ఎల్.ఎ. శ్రీమతి గిడ్డి ఈశ్వరిలు కూడా ఉన్నారు. వీరితో పాటు పాడేరు ఐ.టి.డి.ఎ అధికారులు, అనేక మంది ప్రభుత్వాధికారులు, సంఘ అధికారులు, రౌండ్ టేబుల్ ఇండియా వారు కూడా ఉన్నారు.





•ముగింపు:

గ్రామాలలో, అడవులలో, కొండలలో, కోనలలో, పూరిపాకల్లో నివసిస్తున్న మన బంధువులను ఆదుకునే ప్రయత్నంలో భాగంగా గిరిజన మరియు తీరప్రాంత గ్రామాలలోని బాలలకు ఉత్తమ విద్యనందించడంతో పాటు ఆయా గ్రామాలను వ్యసనముక్త, సంస్కారయుక్త గ్రామాలుగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో ప్రారంభించబడిన ఈ ఉచిత పాఠశాలలు ఆయా ప్రాంతాలలో ప్రతి మండలంలో ప్రారంభించాల్సిన అవసరం ఉంది. ఒక గ్రామంలో ఈ ఉచిత సేవా పాఠశాల కనీసం నిరవధికంగా రెండు సంవత్సరాల పాటు నిర్వహింపబడితే ఆ గ్రామంలో మనం ఆశించిన మార్పు ప్రారంభమౌతుంది.

ఈ ఉచిత సేవా పాఠశాలలను గణనీయ సంఖ్యలో నిర్వహించడం అనేది నేటి సామాజిక అవసరం. వాటి నిర్వహణకు కావాల్సిన ఆర్థిక వనరులను కూడా సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో భారతీయ విద్యా కేంద్రం తన పరివార సభ్యులైన ప్రస్తుత విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత మరియు పూర్వాచార్యులు, ప్రబంధకారిణి సభ్యులు, సాధారణసభ సభ్యులతో పాటు శ్రేయోభిలాషులు మరియు విద్యాభిమానుల నుండి విరాళాల రూపంలో “సేవానిధి”ని సేకరించడం ద్వారా సామాజిక చైతన్యం కోసం జరిగే ఈ పవిత్ర యజ్ఞంలో అందరిని భాగస్వామ్యులను చేసి “విద్య ద్వారా సామాజిక మార్పును” సాకారం చేయాలనేది భారతీయ విద్యా కేంద్ర సంకల్పం.

### భారతీయ విద్యా కేంద్రము ద్వారా ప్రస్తుతం నిర్వహింపబడుతున్న సేవా కేంద్రములు:

| క్రమ సంఖ్య | జిల్లా | మండలము | ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య |
|---|---|---|---|
| 1. | గిరిజన క్షేత్రము, అల్లూరి సీతారామరాజు జిల్లా | పాడేరు | 15 |
| | | హుకుంపేట | 12 |
| | | గంగరాజు మాడుగుల | 17 |
| | | చింతపల్లి | 12 |
| | | డుంబ్రిగూడ | 02 |
| | | గూడెం కొత్తవీధి | 02 |
| | | అరకువేలీ | 08 |
| | | గిరిజన బాలుర ఉచిత ఆవాసము- పాడేరు | 01 |
| | | గిరిజన యువత కౌశాల్యాభివృద్ధి కేంద్రము - పాడేరు | 01 |
| | | గిరిజన మహిళల కుట్టు శిక్షణ కేంద్రము-పాడేరు | 01 |
| 2. | మన్యం పార్వతీపురం జిల్లా | 1) కురుపాం | 02 |
| | | 2) జియ్యమ్మవలస | 05 |
| | | 3) బత్తిలి | 01 |

| క్రమ సంఖ్య | జిల్లా | మండలము | ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య |
|---|---|---|---|
| 3. | సముద్రతీర గ్రామాలు అనకాపల్లి జిల్లా | పరవాడ | 10 |
| | | అచ్యుతాపురం | – |
| | | రాంబిల్లి | 04 |
| | | నక్కపల్లి | 18 |
| | | ఎస్. రాయవరం | 06 |
| | | పాయకరావుపేట | 20 |
| | | యలమంచిలి | 10 |
| | | మునగపాక | 02 |
| | | వడ్డాది మాడుగుల | 01 |
| 4. | కాకినాడజిల్లా | తొండంగి | 06 |
| | | తుని | 03 |
| 5. | శ్రీకాకుళం జిల్లా | కవిటి | 08 |

- **సాధారణ పాఠశాలల ఆధారంగా నిర్వహింపబడుతున్న బాల సంస్కార కేంద్రములు– 33**

